నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, గురువారం 25 జూలై 2024 | HYDERABAD

సరోజినీ దేవి కంటి దవాఖాన సూపరింటెండెంట్‌గా డాక్టర్ మోదిని బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమెను టీఎన్జీవో దవాఖాన యూనిట్ సభ్యులు, నగర కోశాధికారి బాల్‌రాజ్ నేతృత్వంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మహ్మద్ జావీద్, అల్లావుద్దీన్, సాబేర్, శ్రీమన్నారాయణ, విమల తదితరులు పాల్గొన్నారు. - మెహిదీపట్నం

మేడ్చల్, జూలై 24 : నిషేధిత పాలిథిన్ కవర్లు వినియోగిస్తున్న దుకాణాదారులకు మున్సిపాలిటీ అధికారులు జరిమానా విధించారు. మేడ్చల్ పట్టణంలో బుధవారం అధికారులు 33 దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. 18 షాపుల్లో నిషేధిత 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న పాలిథిన్ కవర్లను వినియోగిస్తున్నట్టు గుర్తించారు. ఆ దుకాణాదారులకు రూ.14,500 జరిమానా విధించారు.

బకాయిలు చెల్లించకుంటే
అసెంబ్లీని ముట్టడిస్తాం
జీహెచ్ఎంసీ కార్యాలయం ఎదుట కాంట్రాక్టర్ల నిరసన

సిటీబ్యూరో, జూలై 24 (నమస్తే తెలంగాణ) : పెండింగ్ బకాయిలు చెల్లించాలంటూ బుధవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం ముందు బల్దియా కాంట్రాక్టర్లు ఆందోళన చేపట్టారు. బకాయిలు వెంటనే చెల్లించకపోతే అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. జీహెచ్ఎంసీ కాంట్రాక్టర్స్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో దశల వారీగా ఆందోళనలను ఉధృతం చేస్తామని కాంట్రాక్టర్లు హెచ్చరించారు. పెండింగ్ బిల్లులు క్లియర్ కాకపోవడంతో కొందరు ఆత్మహత్య చేసుకున్నారని, ప్రాణాలు పోతున్నా.. ప్రభుత్వం తమ సమస్యను పట్టించుకోవడం లేదని కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేశారు. వడ్డీలకు, ఇంట్లో బంగారు ఆభరణాలను సైతం తాకట్టు పెట్టి నగరంలో అభివృద్ధి పనులు చేపట్టామని వెల్లడించారు. అసెంబ్లీ, ఎంపీ ఎన్నికలకు చేసిన పనులకు కూడా బిల్లులు చెల్లించడం లేదని చెప్పారు. బకాయిలు చెల్లించాలని ఆందోళన చేస్తుంటే.. గేట్ల వద్ద సెక్యూరిటీతో అడ్డుకొని అవమానిస్తున్నారని, కమిషనర్ జోక్యం చేసుకొని రూ. 1500 కోట్ల బకాయిలు చెల్లించాలని కాంట్రాక్టర్స్ యాక్షన్ కమిటీ ప్రతినిధులు కోరారు.

సమావేశంలో మాట్లాడుతున్న బల్దియా అదనపు కమిషనర్ చంద్రకాంత్‌రెడ్డి

మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం
బల్దియా అదనపు కమిషనర్ చంద్రకాంత్‌రెడ్డి

సిటీబ్యూరో, జూలై 24 (నమస్తే తెలంగాణ): మహిళా శక్తి పథకంతో వచ్చే ఐదేండ్లలో మహిళలను కోటీశ్వరులను చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ చంద్రకాంత్ రెడ్డి అన్నారు. బుధవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని పన్వర్‌హాల్‌లో యూసీడీ ప్రాజెక్టు ఆఫీసర్లు, టీఎల్ఎఫ్ లీడర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూసీడీ జాయింట్ కమిషనర్, పరిశ్రమల శాఖ జేడీ, పుడ్ ప్రాసెసింగ్ సొసైటీ అధికారులు, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల ఎల్‌డీఎంలు, మెప్మా స్టేట్ మిషన్ నోడల్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ చంద్రకాంత్‌రెడ్డి మాట్లాడుతూ మహిళా శక్తి పథకం కింద క్యాంటీన్లు, క్యాటరింగ్ యూనిట్స్, తెలంగాణ పిండి వంటలు, బొటిక్స్, పిండిగిర్నీ, డీటీపీ జిరాక్స్ సెంటర్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ యూనిట్స్ వంటివి ఏర్పాటు చేసుకునేలా ఎస్‌హెచ్‌జీ మహిళలకు అవగాహన కల్పించి.. పథకం అమలు చేయడంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. సమావేశంలో యూసీడీ ప్రాజెక్టు జాయింట్ కమిషనర్ వెంకట్‌రెడ్డి, పీడీ సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

బహదూర్‌పురలోని ఉమ్మా ప్రభుత్వ ఉన్నత ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

బాధ్యతగా పనిచేయండి
అధికారులకు కలెక్టర్ ఆదేశం

సిటీబ్యూరో, జూలై 24 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యాబోధనతో పాటు పాఠశాలల అభివృద్ధికి అధికారులు పోటీపడి బాధ్యతగా పనిచేయాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. బహదూర్‌పురలోని ఉమ్మా ప్రభుత్వ ఉన్నత ప్రాథమిక పాఠశాలను ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాల్లో చెత్తా చెదారం ఉండటాన్ని గమనించిన కలెక్టర్.. ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలో హాజరు రిజిస్టర్ పరిశీలించి రికార్డు అప్‌డేట్ చేయాలన్నారు. స్కూల్ ఆవరణలోని భవిత సెంటర్‌లోని గదులు చీకటిగా ఉండటంతో ట్యూబ్‌లైట్లు ఏర్పాటు చేయించాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట డీఈవో రోహిణి, జిల్లా బీసీ అభివృద్ధి శాఖాధికారి ఆశన్న, డిప్యూటీ డీఈఓ సత్యవతి, డిప్యూటీ ఐఎస్ఓ ఖలీల్, డీఈ రాజన్న తదితరులు ఉన్నారు.

లింక్ క్లిక్ చేయగానే..

సిటీబ్యూరో: సైబర్ నేరగాళ్లు మరోసారి రెచ్చిపోయారు. ఓ వివాహితను బ్లాక్‌మెయిల్ చేసి.. రూ. 3 లక్షలు కాజేశారు. గృహిణికి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయంటూ.. ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ సందేశం వచ్చింది. ఆ లింక్‌ను క్లిక్ చేయగానే..మొబైల్‌కు ఓటీపీ వచ్చింది. ఆ నంబర్‌లో నమోదు చేయడంతో సైబర్‌నేరగాళ్లు ఆ ఫోన్‌ను హ్యాక్ చేశారు. ఈ క్రమంలో కొన్ని రోజులకు ఆమె ఫోన్‌కు నగ్న ఫొటోలు వచ్చాయి. 'ఈ ఫొటోలను నీ ఫోన్‌లోని కాంటాక్ట్‌లో ఉన్న వారందరికీ పంపిస్తామం'టూ నిందితులు బెదిరించారు. పలు దఫాలుగా డబ్బులు వసూలు చేశారు. వాట్సాప్ నుంచి ఆ ఫొటోలు డిలీట్ చేయాలంటే డబ్బులు ఇవ్వాలంటూ.. తనను బెదిరిస్తున్నారంటూ.. బాధితురాలు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు దర్యాప్తు చేపట్టారు.

సికింద్రాబాద్ మేకలమండి..

ఖర్చు ఘనం.. చెత్త పదిలం!

గ్రేటర్‌లో ఎక్కడి వ్యర్థాలు అక్కడే • అమలు కాని జీవీపీ పాయింట్ల ఎత్తివేత

సిటీబ్యూరో, జూలై 24 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్‌లో పారిశుధ్య నిర్వహణ గాడి తప్పుతోంది. నగరాన్ని చెత్త రహితంగా తీర్చిదిద్దాల్సిన బల్దియా అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నది. పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణ, వ్యాధుల నివారణకు ఏటా రూ.300 కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నా..లక్ష్యాన్ని మాత్రం సాధించలేకపోతున్నది. ఇంటింటికీ తడి, పొడి చెత్త సేకరణ, తరచూ చెత్త వేసే ప్రాంతాల (గార్బేజ్ వల్నరబుల్ పాయింట్స్-జీవీపీ) ఎత్తివేతలో అధికారుల వైఫల్యం కొట్టొచ్చినట్లు కనబడుతోంది. గ్రేటర్ వ్యాప్తంగా చెత్త డబ్బాలను ఎత్తి వేయగా, ఇప్పటికీ 2640 చోట్ల చెత్త కుప్పలున్నట్లు ఆస్కి (అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా) ఇటీవల నిర్వహించిన సర్వేలో తేల్చడమే అధికారుల పనితీరును ప్రశ్నిస్తోంది. ఈ నేపథ్యంలో నగరంలో ఎక్కడా చూసినా చెత్త కుప్పలే దర్శనమిస్తున్నాయి. బస్తీలు..కాలనీల్లో వ్యర్థాలు పేరుకుపోవడంతో దోమలు విజృంభిస్తున్నాయి. వివిధ వ్యాధులతో ప్రజలు అవస్థలుపడుతున్నారు. చెత్త తరలింపు కేవలం కాగితాల్లో మాత్రమే కనిపిస్తున్నది. మేయర్, డిప్యూటీ మేయర్, కమిషనర్ మొదలుకొని డిప్యూటీ కమిషనర్ల వరకు ఆకస్మిక పర్యటనలు లేకపోవడంతో పారిశుధ్య నిర్వహణ గాడితప్పుతున్నది.

చెత్త కుప్పలే దర్శనం..

గడిచిన కొన్ని రోజులుగా ఎక్కడ చూసినా.. రహదారుల వెంట పేరుకుపోయిన చెత్త కుప్పలే దర్శనమిస్తున్నాయి. స్వచ్ఛ సర్వేక్షణ్-2024లో హైదరాబాద్ నగరాన్ని స్వచ్ఛతలో అగ్రస్థానంలో నిలుపుతామన్న లక్ష్యం నీరుగారుతోంది. తరచూ చెత్త వేసే ప్రాంతాలు (గార్బేజ్ వల్నరబుల్ పాయింట్స్) జీహెచ్ఎంసీ పరిధిలో 2640 ప్రాంతాలను గుర్తించి, వాటిని పూర్తి స్థాయిలో ఎత్తివేసేలా చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్నారు. కానీ క్షేత్రస్థాయిలో వీటికి అదనంగా కొత్తగా జీవీపీ పాయింట్లు పుట్టుకొస్తున్నాయి. స్వచ్ఛ ఆటోల ద్వారా ఇంటింటి చెత్త సేకరణ సరిగా జరగడం లేదు. ఈ నేపథ్యంలోనే పారిశుధ్యంపై ఫిర్యాదులు అధికం కావడం, ఇటీవల హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో స్వయంగా మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పారిశుధ్య నిర్వహణ ఏ మాత్రం బాగులేదని, తన డివిజన్‌లో చెత్త ఎత్తడం లేదని సంబంధిత అధికారులపై మండిపడ్డారు. వాస్తవంగా వర్షాకాలంలో వ్యర్థాలు త్వరగా కుళ్లి దుర్గంధం వెదజల్లే పరిస్థితులు ఎక్కువ. అయితే చెత్తను ఎప్పటికప్పుడు తరలించేందుకు వర్షాకాలంలో ప్రత్యేక ఏర్పాట్లు చేయడం లేదు. ఇప్పటికే మలేరియా, డెంగీ కేసులు విజృంభిస్తున్నాయి.

పర్యవేక్షణ ఏదీ?

ఇంటింటి చెత్త సేకరణ లక్ష్యం అమలు కావడం లేదు.గ్రేటర్‌ను చెత్తర హిత నగరంగా తీర్చిదిద్దే చర్యల్లో భాగంగా దాదాపు మూడున్నరేండ్ల కిందట డస్ట్ బిన్ లెస్ సిటీ పేరుతో చెత్త కుండీలను జీహెచ్ఎంసీ ఎత్తేసింది. మెరుగైన పారిశుధ్య నిర్వహణను పకడ్బందీ చేస్తూ వందకు వంద శాతం ఇంటింటి చెత్త సేకరణకు స్వచ్ఛ ఆటోల సంఖ్యను పెంచారు. సుమారు 5250 స్వచ్ఛ ఆటోల ద్వారా నగరంలో 4886 కాలనీల్లో 23 లక్షల గృహాల నుంచి రోజుకు 7వేల మెట్రిక్ టన్నులకు పైగా చెత్త సేకరణ జరగాలి. ఒక్కొక్క ఆటోకు కాలనీల వారీగా చూస్తే ఒకటి లేదా రెండు కాలనీలు గృహాల ప్రకారంగా గమనిస్తే ఒక్కొక్క అటోకు సుమారుగా 500 నుంచి 600 ఇండ్లను కేటాయించి, చెత్త సేకరణ జరపాలి. కానీ గడిచిన కొన్ని రోజులుగా స్వచ్ఛ ఆటోల పనితీరు సరిగా ఉండటం లేదు. చాలా కాలనీలకు రోజూ స్వచ్ఛ ఆటోలు రావడం లేదు. వందకు వంద శాతం స్వచ్ఛ ఆటోల అటెండెన్స్ ఉండటం లేదు. రోజూ 1000 స్వచ్ఛ ఆటోలు పనిచేయడం లేదని.. స్వయంగా గత కమిషనర్ రోనాల్డ్ రాస్ గుర్తించారు. నేటికీ స్వచ్ఛ ఆటోల పనితీరుపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపించింది. దీంతో ఎక్కడ చెత్త అక్కడే పేరుకుపోతున్నది. సమయ పాలన పట్టించుకోకపోవడం, చెత్త సేకరణలో అధిక వసూళ్లకు తెరలేపడం, సిటీలో ఉండాల్సిన స్వచ్ఛ ఆటోలు గ్రేటర్ సరిహద్దులు దాటుతుండటం గమనార్హం. ఇదే విషయంపై ఇటీవల కొత్త కమిషనర్ ఆమ్రపాలి సైతం స్వచ్ఛ ఆటోల పనితీరు మెరుగుపర్చాలని, లేదంటే చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

హైదరాబాద్ నగరాన్ని స్వచ్ఛతలో అగ్రస్థానంలో నిలపడమే లక్ష్యంగా గత కేసీఆర్ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా తడి, పొడి చెత్త వేర్వేరుగా, ఇంటింటి చెత్త సేకరణ, కాలనీ, బస్తీ సంక్షేమ సంఘాల భాగస్వామ్యం, ఓడీఎఫ్‌కు చర్యలు, బహిరంగ మలమూత్ర విసర్జన నివారణ చర్యలు, స్వచ్ఛతపై చైతన్య కార్యక్రమాలు, 50 మైక్రాన్ల కన్నా తక్కువ నిడివి ఉన్న ప్లాస్టిక్ నిషేధం వంటి కార్యక్రమాలు పక్కాగా చేపట్టింది. చెత్త కుండీలు లేని నగరంగా తీర్చిదిద్దే క్రమంలో దాదాపు 22 లక్షల గృహాలకు ఒక్కో ఇంటికి తడి, పొడి చెత్త సేకరణకు 44 లక్షల చెత్త బుట్టలను పంపిణీ చేశారు. ఇంటింటికీ చెత్త సేకరణకు 4500 స్వచ్ఛ ఆటో టిప్పర్లను వినియోగించారు. ఫలితంగా జీహెచ్ఎంసీకు 'బెస్ట్‌సెల్ఫ్ సస్టైనబులిటీ అవార్డు, 3 స్టార్ రేటింగ్ సిటీగా హైదరాబాద్ నిలిచింది.

న్యూ ఆగాపురా..

కవాడిగూడ గోశాల వెనుకవైపు..

గాంధీ వైద్యశాల వెనకాల..

మణికొండ వద్ద ఓయూ కాలనీలో..

అవును..సిటీ ట్రాఫిక్ నరకమే..

సిటీబ్యూరో: నగరంలో ట్రాఫిక్ కష్టాలను కండ్లకు కడుతూ.. 'నమస్తే'లో ప్రచురితమైన 'నగరం ట్రాఫిక్ నరకం' కథనానికి విశేష స్పందన వచ్చింది. పలువురు సోషల్ మీడియా వేదికగా తమ అనుభవాలను పంచుకున్నారు. ఎక్స్, వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టా వేదికలపై పలువురు నెటిజన్లు నగరంలోని తాము ఎదుర్కొన్న ట్రాఫిక్ నరకంపై అభిప్రాయాలు వెల్లడించారు. ఇలాంటి ట్రాఫిక్ కష్టాలు.. గతంలో లేవని ఓ నెటిజన్ తన అభిప్రాయాన్ని పంచుకోగా, హబ్సిగూడ, సంగీత్ జంక్షన్, రసూల్‌పుర జంక్షన్, జూబ్లీహిల్స్, గచ్చిబౌలి, నానక్ రాంగూడ ఔటర్, హైటెక్ సిటీ, నిజాంపేట్ జంక్షన్, ఎల్బీనగర్ చౌరస్తాలో వాహనదారులు ఎదుర్కొంటున్న ట్రాఫిక్ కష్టాలను కండ్లకు కట్టినట్లు చూపించిన 'నమస్తే' కథనం పోలీసులకు ఓ సూచనగా పనిచేస్తుందని మరో నెటిజన్ పేర్కొన్నారు.

నాలుగేండ్ల చిన్నారిపై కుక్కల దాడి

మేడ్చల్ రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపల్ పరిధిలోని ప్రెస్టేజ్ గ్రీన్ కాలనీలో ఓ నాలుగేండ్ల చిన్నారిపై వీధి కుక్కలు దాడి చేశాయి. కాలనీలో చిన్నారి ఇంటి ముందు ఆడుకుంటుండగా ఐదు కుక్కలు ఒకేసారి దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. వెంటనే చిన్నారిని స్థానిక దవాఖానకు తీసుకెళ్లగా, అక్కడి వైద్యుల సూచన మేరకు గాంధీ దవాఖానకు తరలించారు.

బడ్జెట్‌లో బల్దియాకు ఎంత దక్కేనో?

సిటీబ్యూరో: తెలంగాణ పురోగతిలో హైదరాబాద్ నగరం అత్యంత కీలక పాత్రను పోషిస్తోంది. రాజధాని చుట్టూ జరిగే అభివృద్ధే ప్రామాణికంగా చేసుకొని పెట్టుబడులు, కంపెనీల స్థాపన, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ప్రభావితమవుతాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత బీఆర్ఎస్ పాలనలో హైదరాబాద్ మహానగరం ప్రగతి పథంలోకి దూసుకెళ్లింది. ఎస్ఆర్‌డీపీ, ఎస్ఎన్‌డీపీ, మెట్రోలతో పాటు ఐకానిక్ కట్టడాలు, అటు అభివృద్ధి, ఇటు సంక్షేమంలో జోడెద్దులా మాదిరిగా బీఆర్ఎస్ సర్కారు హయాంలో హైదరాబాద్ అంతర్జాతీయ గుర్తింపును పొందింది. వరుసగా ఐదు సార్లు మెరుగైన జీవన ప్రమాణాలు కలిగిన నగరంగా గుర్తింపు దక్కించుకున్నది. ఇటువంటి మహానగరంలో ప్రగతి ప్రస్థానం ఆగకూడదు అంటే కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం.. హైదరాబాద్ అభివృద్ధి కోసం బడ్జెట్‌లో సమృద్ధిగా నిధులు కేటాయించాలి. ప్రస్తుత ప్రాజెక్టులతో పాటు మరిన్ని అభివృద్ధి పనులకు జీహెచ్ఎంసీ, జలమండలి, హెచ్ఎండీఏ, వైద్య ఆరోగ్య శాఖలు సమర్పించిన ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకోవాలి. గురువారం అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించనున్న బడ్జెట్‌పై గ్రేటర్‌వాసులు భారీగా ఆశలు పెట్టుకున్నారు.

బల్దియాను ఆదుకునేనా?

జీహెచ్ఎంసీ ఆర్థిక వ్యవస్థ కుదేలైంది. గత ఆర్థిక సంవత్సరం రూ. 6,530 కోట్ల బల్దియా బడ్జెట్‌లో.. ఇప్పటికే రూ. 6,314 కోట్లు ఖర్చు చేశారు. మున్సిపల్ బాండ్లు, రూపీ టర్మ్ రూపంలో పలు దఫాలుగా తీసుకున్న మెజార్టీ రుణానికి ప్రస్తుతం వడ్డీ మాత్రమే చెల్లిస్తుండగా, ఏప్రిల్ నుంచి అసలు, వడ్డీ కలిపి వాయిదాలు చెల్లించాల్సి ఉంది. ప్రస్తుతం సగటున నెలకు రూ. 68 కోట్లు చెల్లిస్తుండగా, 2024-25 ఆర్థిక సంవత్సరానికి అది సుమారు రూ.105 కోట్లకు చేరనున్నది. రాబోయే రోజుల్లో మరింత అధికం కానున్నది. ఈ నేపథ్యంలోనే ఆర్థిక సమస్యలతో పాటు కొత్త ప్రాజెక్టుల కోసం రూ. 5,400 కోట్లతో బల్దియా ప్రతిపాదనలు ప్రభుత్వానికి సమర్పించింది. వాస్తవంగా బల్దియా ఇప్పటికే ప్రతి నెల వేతనాలు, పింఛన్లకు రూ. 130 కోట్లు, చెత్త తరలింపు, నిర్వహణకు సంబంధించి టిప్పింగ్ ఫీ కింద సుమారు రూ.40 కోట్లు, వీధి దీపాల నిర్వహణ రూ. 7 కోట్లు, రోడ్ల నిర్మాణం, నిర్వహణ, ఇతర పనులకు రూ. 100 కోట్లు ఖర్చు చేస్తున్నది. ప్రతి నెల ఆదాయానికి.. ఖర్చుకు దాదాపు ఏటా రూ. 900 కోట్ల మేర లోటు బడ్జెట్ ఉంటోంది. ముఖ్యంగా రూ. 1000 కోట్ల మేర పెండింగ్ బిల్లులు కాంట్రాక్టర్లకు చెల్లించాల్సి ఉంది. ఈ పెండింగ్ బిల్లులు చెల్లించే వరకు అభివృద్ధి పనులు చేపట్టబోమని ఇప్పటికే జీహెచ్ఎంసీకి కాంట్రాక్టర్లు అల్టిమేటం జారీ చేసి.. రోజుకో రీతిలో నిరసన తెలుపుతున్నారు. ఈ నేపథ్యంలోనే రెండో దశ ఎస్ఆర్‌డీపీ, ఎస్ఎన్‌డీపీ, సీఆర్ఎంపీ పనులకు, మూసీ సుందరీకరణకు రూ.వేల కోట్లలో నిధులు అవసరమంటూ.. జీహెచ్ఎంసీ ప్రభుత్వానికి బడ్జెట్ ప్రతిపాదన సమర్పించింది.

నిధులపై జలమండలి ఆశలు

బడ్జెట్‌పై జలమండలి సైతం గంపెడాశలు పెట్టుకున్నది. రూ.6,150 కోట్ల మేర నిధులు కావాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించింది. గోదావరి, కృష్ణా ఫేజ్‌లకు చేసిన రుణాలు, వార్షిక వడ్డీలకు రూ.1100 కోట్లు, నూతన మురుగునీటి శుద్ధి కేంద్రాలు, ఇతర అభివృద్ధి పనులకు రూ. 2700 కోట్లు, ఉచిత తాగునీటి పథకానికి రూ. 500 కోట్లు, విద్యుత్ బకాయిల చెల్లింపునకు రూ. 500 కోట్లు , రూ. 1350 కోట్లు సుంకిశాల ప్రాజెక్టుకు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరింది.



అల్వాల్ మండల కార్యాలయంలో కల్యాణలక్ష్మీ - షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

తులం బంగారమేది?
కల్యాణ లక్ష్మీ- షాదీముబారక్ చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే మర్రి

మల్కాజిగిరి, జూలై 24: పేదింటి ఆడ బిడ్డల పెండ్లిండ్లకు కల్యాణ లక్ష్మీ చెక్కులు సరే మరి.. తులం బంగారమేది ?అని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ప్రశ్నించారు. బుధవారం అల్వాల్ మండల కార్యాలయంలో కల్యాణ లక్ష్మీ-షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ పేదింటి ఆడబిడ్డల పెండ్లిండ్ల కోసం ఆర్థికంగా ఆదుకోవడానికి గత సీఎం కేసీఆర్ కల్యాణ లక్ష్మీ- షాదీముబారక్ పథకాన్ని ప్రారంభించారన్నారు. రూ.50వేల నుంచి విడతలవారీగా రూ.1,00,116లకు పెంచారని గుర్తు చేశారు. కాంగ్రెస్ నేతలు ఎన్నికల ప్రచారంలో కల్యాణ లక్ష్మీ - షాదీముబారక్ పథకంలో రూ.1 ,00,116తో పాటు తులం బంగారం అందజేస్తామని ప్రసంగాల్లో ఉదరగొట్టారన్నారు. ప్రభుత్వం వచ్చి ఎనిమిది నెలలవుతున్నా తులం బంగారం ఊసేలేదని విమర్శించారు.

9999@ ₹19.51 లక్షలు

సిటీబ్యూరో: ఖైరతాబాద్ ఆర్టీఏలో కొత్త సిరీస్ బుధవారం ప్రారంభంకావడంతో ఫ్యాన్సీ నంబర్లను సొంతం చేసుకునేందుకు వాహనదారులు పోటీపడ్డారు. ఒక్క రోజులో వివిధ ఫ్యాన్సీ నంబర్లకు రూ. 51.18 లక్షల ఆదాయం సమకూరింది. ఇందులో టీజీ09ఏ 9999 నంబర్‌ను రూ. 19.51 లక్షలకు హానర్ డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ దక్కించుకోవడం విశేషం. 0001ను రూ. 8.25 లక్షలకు ఎన్‌జీ మైండ్ ఫ్రేమ్ కంపెనీ, 0009ను రూ. 6.66 లక్షలకు, 0006ను రూ. 2.91లక్షలకు, 0005ను రూ. 2.5 లక్షలకు, 0019ను రూ.1.30 లక్షలకు వాహనదారులు సొంతం చేసుకున్నారు.